

తపాలా ఉద్యోగులకు ప్రశంసలు

తపాలా పథకాల అమలులో ప్రతిభ కనబర్చిన పలువురు ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

10లో



కార్పొరేట్లకే ప్రయోజనం

కేంద్రప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ప్రయోజనం కలిగించేలా పాలన సాగిస్తోందని పలువురు నాయకులు ఆరోపించారు.

10లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం
32° / 18°

జిల్లాలో శనివారం చలి తీవ్రత పెరిగే అవకాశముంది. రోజంతా చలిగాలుల ప్రభావం ఉంటుంది.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

- ప్రభుత్వ స్థలాల సంరక్షణకు టాస్క్‌ఫోర్స్ కమిటీ
- ఇప్పటికే 46.23కోట్ల విలువైన భూమి స్వాధీనం
- ప్రాజెక్టుల పూర్తితో జిల్లాలో అదనంగా ఆయకట్టు
- 'రైతు భరోసా' ద్వారా రూ.118.07 కోట్లు జమ
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ వీ.పీ.గౌతమ్





పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగిస్తున్న కలెక్టర్ వీ.పీ.గౌతమ్



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమ్, సీపీ సునీల్‌దత్

ఖమ్మం సహకారనగర్: అన్నివర్గాల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పథకాలను అమలుచేస్తున్నామని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ వెల్లడించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో కలెక్టర్ జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందన స్వీకరించాక ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలులో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేలా అహర్నిశలు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ప్రజాపాలన సభల ద్వారా స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు పూర్తయిందని చెప్పారు. మధ్యవర్తుల అవసరం లేకుండా త్వరలోనే అర్హులకు పథకాలు అందుతాయని తెలిపారు. ఇప్పటికే ప్రకటించినట్లుగా మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలవుతుండగా, రాజీవ్ ఆరోగ్యశ్రీ చికిత్స పరిధిని రూ.10లక్షలకు పెంచామన్నారు. కాగా, మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో ఈనెల 18వ తేదీ వరకు 11.77 లక్షల మంది ఉచితంగా ప్రయాణించారని తెలిపారు. కాగా, రైతుభరోసా ద్వారా జిల్లాలో 2,23,684 మంది రైతులకు రూ.118.07 కోట్లు జమ కాగా, రూ.2 లక్షల రుణమాఫీకి బ్యాంకులతో సంప్రదింపులు జరుగుతున్నాయన్నారు. అలా గే, ఖరీఫ్ కాలానికి సంబంధించి ఇప్పటి వరకు 1,07,279 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు కింద ఇప్పటి వరకు 1,331 మంది రైతులతో 4,543 ఎకరాల్లో మొక్కలు నాటించామన్నారు.

వేగంగా ప్రాజెక్టుల పనులు

సీతారామ ఎత్తిపోతల పథకం కింద పాలేరు లింక్ కాల్వ ద్వారా కొత్త ఆయకట్టుకు సాగు నీటి వసతి కల్పించేలా పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇక కట్టలేరు, జాలిముడి, పండ్రేగిపల్లి కింద కూడా కొత్త ఆయకట్టుపై దృష్టి సారించామన్నారు. ఖమ్మం నగరం, ఖమ్మం రూరల్ మండలాను మున్నేరు ముంపు నుంచి కాపాడేందుకు నిర్మించనున్న కాంక్రీట్ రక్షణ గోడ పనులు టెండర్ల దశలో ఉన్నాయని తెలిపారు.

విద్య, వైద్యానికి పెద్దపీట

జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఈ ఏడాది తరగతులు మొదలవగా, పాలేరు, సత్తుపల్లిల్లో నర్సింగ్ కళాశాలల తరగతులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఆరోగ్య మహిళ ద్వారా జిల్లాలో 8,973 మందికి పరీక్షలు, 1,882 మందికి చికిత్స అందించామన్నారు. జిల్లాలో 161 పల్లె దవాఖానాలు, తొమ్మిది బస్తీ దవాఖానాల ద్వారా ప్రజలకు వైద్యాన్ని చేరువ చేశామని చెప్పారు. ఇక విద్యారంగంలో తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించినట్లు తెలిపారు. కాగా, ఖమ్మంలోని పటేల్ స్టేడియంలో రూ.93 లక్షల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మూడు టెన్నిస్ కోర్టులు నిర్మించామని వెల్లడించారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణ

జిల్లాలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశామని కలెక్టర్ వెల్లడించారు. ఖమ్మం నగర పరిధిలో కేఎంసీ కమిషనర్ చైర్మన్‌గా, ఖమ్మం ఆర్డీఓ మెంబర్ కన్వీనర్‌గా ఈ కమిటీ పనిచేస్తోందని తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడుతూనే ఆక్రమణలో ఉన్న సుమారు రూ.46.23 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుందని వెల్లడించారు. ఈ వేడుకల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీఎస్.జగ్జీవన్‌కుమార్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, మధుసూదన్ నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, ట్రెయినీ ఐపీఎస్ మౌనిక, జిల్లా అటవీ శాఖాధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విజయవంతంగా ఎన్నికలు

జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించామని కలెక్టర్ గౌతమ్ వెల్లడించారు. 49,396మంది యువతను ఓటర్లుగా నమోదు చేయించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచామన్నారు. అలాగే, పోస్టల్ ఓట్ల పోలింగ్‌లో జిల్లాకు రాష్ట్రంలోనే జిల్లా ద్వితీయ స్థానం దక్కిందని తెలిపారు. త్వరలోనే జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, లోక్‌సభ ఎన్నికలు కూడా సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయనున్నట్లు కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు.





నృత్యం చేస్తున్న మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థినులు

న్యూస్‌రీల్

నేడు జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. భట్టి విక్రమార్క తన పర్యటనలో భాగంగా 10గంటలకు మధిర మండలం బయ్యారంలో గ్రామపంచాయతీ భవనం, చిలుకూరులో పాఠశాల భవనం, నిదానపురం, మాటూరులో ఆరోగ్య ఉప కేంద్రాలు, చింతకాని మండలం నాగులవంచలో రైతు వేదిక, చిన్నమండవలో ఆరోగ్యకేంద్రం, నాగులవంచ ప్రభుత్వ పాఠశాలలో వాటర్ ప్లాంట్, డైనింగ్ హాల్, కొదుమూరులో గ్రామపంచాయతీ భవనం, విద్యుత్ ఉప కేంద్రాలను ప్రారంభిస్తారు. అలాగే, సాయంత్రం 6గంటలకు చింతకానిలో జరిగే అభినందన సభలో భట్టి పాల్గొంటారు.

మంత్రి తుమ్మల..

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ఖమ్మం నియోజకవర్గంలో పర్యటిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఖమ్మంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రి సాయంత్రం 4గంటలకు రఘునాధపాలెం మండలం మంచుకొండలో ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభిస్తారు. ఆతర్వాత ఖమ్మం రూరల్ మండలం పెద్దతండాలోని ప్రియదర్శిని కళాశాలలో జరుగుతున్న సృజనోత్సవ్‌కు మంత్రి హాజరవుతారు.

విధుల్లో చేరిన మార్కెట్ కార్యదర్శి



కార్యదర్శికి పుష్పగుచ్ఛం ఇస్తున్న వ్యాపార ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా నియమితులైన పి.ప్రవీణ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న ఆయన మార్కెట్ కార్యాలయంపై జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా కార్యదర్శిని మార్కెట్ అధికారులు, ఉద్యోగులు బి.బజార్, వజీరుద్దీన్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, హోల్‌సేల్, రిటైల్ కూరగాయల వ్యాపారుల సంఘం ప్రతినిధులు కూడా కార్యదర్శిని కలిశారు.

పాఠశాలకు రూ.లక్షన్నర విలువైన పుస్తకాలు



గబ్రూనాయక్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

కామేపల్లి: మండలంలోని ముద్దులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల లైబ్రరీ, రీడింగ్ రూంకు ఎంపీటీసీ గుగులోత్ గబ్రూనాయక్ రూ.లక్షన్నర విలువైన పుస్తకాలను శుక్రవారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. చదువుతోనే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చని తెలిపారు. అనంతరం గ్రామస్తులు ఎంపీటీసీని సత్కరించారు. సర్పంచ్ పులసం జయమ్మ, హెచ్ఎం భూక్యా రమేష్‌తో పాటు నారాయణరెడ్డి, గోపీరెడ్డి, రామనాథం, కాత్రాల రాంబాబు, అంబటి శ్రీనివాస రెడ్డి, మల్లయ్య, సామా మోహన్‌రెడ్డి, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్‌గా 'కొత్వాల'

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) చైర్మన్ బాధ్యతలను వైస్‌చైర్మన్ కొత్వాల శ్రీనివాస రావుకు అప్పగించారు. ఈమేరకు సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్, జిల్లా సహకార అధికారి ఏ.విజయకుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీసీఎంఎస్ చైర్మన్‌గా ఉన్న రాయల వెంకట శేషగిరిరావు డీసీసీబీ నుంచి తీసుకున్న వాహన రుణం సకాలంలో చెల్లించకపోవడంతో ఇటీవల అనర్హత వేటు వేశారు. ఈ నేపథ్యాన వైస్ చైర్మన్‌గా ఉన్న కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాసరావుకు చైర్మన్ బాధ్యతలు అప్పగించారు. ఆయన ఒకటి, రెండు రోజుల్లో పదవీ బాధ్యతలు స్వీకరించే అవకాశముంది.

చిరంజీవికి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ




ఖమ్మంమయూరిసెంటర్: సినీ హీరో చిరంజీవికి కేంద్రప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారాన్ని ప్రకటించడంపై రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో శుక్రవారం చిరంజీవిని కలిసిన ఆయన పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


మాస్టర్ 'ప్లాన్' కదిలేనా?!

పాత ప్లాన్‌తోనే ఖమ్మంలో నిర్మాణ అనుమతులు

- ఏళ్ల తరబడి వాయిదా పడుతున్న కొత్త ప్లాన్
- ప్రస్తుత నిర్మాణాలతో భవిష్యత్‌లో ఇబ్బందులు
- తాజాగా మంత్రి తుమ్మల దృష్టికి తీసుకెళ్లిన అధికారులు



ఖమ్మం నగర వ్యూ



సుడా ప్లానింగ్ ఏరియా మ్యాప్

ఖమ్మంమయూరిసెంటర్: అభివృద్ధి చెందుతున్న ఖమ్మం నగరానికి మాస్టర్ ప్లాన్ లేకపోవడంతో నిర్మాణాలు, అభివృద్ధి కార్యక్రమాల్లో తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఖమ్మం మున్సిపాలిటీ నుండి నగర పాలక సంస్థగా రూపాంతరం చెంది ఏళ్లు గడుస్తున్నా మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం లభించక ఇష్టానుసారంగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికీ 2008 నాటి డ్రాఫ్ట్ ప్లాన్‌తోనే నిర్మాణ అనుమతులు జారీ చేస్తున్నారు. దీంతో భవిష్యత్‌లో అభివృద్ధికి ఆటంకాలు ఎదురవుతాయనే వాదనలు వినిపిస్తున్నాయి. మాస్టర్ ప్లాన్ సిద్ధమైనా అనుమతి లభించకపోగా.. ఇటీవల కేఎంసీలో జరిగిన సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి కొన్ని మార్పులు సూచించడంతో త్వరలోనే ఆమోదం లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

2017లో 'సుడా' ఏర్పాటు

2017 అక్టోబర్ 24న ఖమ్మం నగర పాలక సంస్థతోపాటు చుట్టుపక్కల ఏడు మండలాల పరిధిలోని 46 గ్రామపంచాయతీలను కలుపుతూ స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇదేక్రమంలో సుడాకు మాస్టర్ ప్లాన్ రూపొందించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులోభాగంగా స్టైమ్ అనే సంస్థకు బాధ్యతలు అప్పగించగా డ్రాఫ్ట్ సిద్ధం చేశారు. రాబోయే 20 ఏళ్ల అవసరాలు తీర్చేలా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసినా ఇప్పటికీ అనుమతి లభించలేదు.

536 చదరపు కి.మీ. పరిధిలో...

స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) పరిధిలో ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు, వైరా, ఖమ్మంరూరల్, కూసుమంచి, ముదిగొండ, చింతకాని, కొణిజర్ల, రఘునాథపాలెం మండలాల్లోని 46 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటన్నింటికీ కలిపి ఇప్పటికే జరుగుతున్న అభివృద్ధి, పెరుగుతున్న జనాభా ప్రాతిపదికన మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. 536 చదరపు కిలోమీటర్ల పరిధిలో రెసిడెన్షియల్, కమర్షియల్, ఇండస్ట్రియల్, రిక్రియేషన్, పబ్లిక్, సెమీ పబ్లిక్ జోన్లు, రహదారులు, జల వనరుల వివరాలను పొందుపర్చారు. ప్రస్తుతం అమలవుతున్న కేఎంసీ మాస్టర్ ప్లాన్ 33 చదరపు కిలోమీటర్ల వైశాల్యానికి మాత్రమే రూపొందించారు. ఇందులో రెసిడెన్షియల్, కమర్షియల్, ఇండస్ట్రియల్ జోన్లు, రోడ్ల వివరాలు సక్రమంగా లేవనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యాన కొత్త మాస్టర్ ప్లాన్ అన్ని అంశాలతో సిద్ధమైనా అమల్లోకి రావడం లేదు.

అవాంతరాలు..

సుడా మాస్టర్ ప్లాన్ అంశం నాలుగేళ్లుగా కొనసాగుతోంది. సుడా ఏర్పడకముందే మాస్టర్ ప్లాన్ తెరపైకి వచ్చినా వాయిదా పడింది. మళ్లీ సుడా ఏర్పడ్డాక అధికారులు సిద్ధమైనా వరుస ఎన్నికలు, ఇతర కారణాలతో అడుగు ముందుకు పడలేదు. ఎట్టకేలకు 2020 ఏడాదిలో ప్లాన్ తయారీ మొదలైనా మళ్లీ ఆగిపోయింది. ఆ తర్వాత 2021 ఏడాదిలో ముసాయిదా ప్లాన్ తయారు చేసి సమీక్షలు నిర్వహించారు. అప్పట్లో ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా మరోసారి పక్కన పెట్టారు. అనంతరం అనేక పరిణామాలు, ఇతర కారణాలతో ప్రభుత్వం పూర్తిగా కొత్త మాస్టర్ ప్లాన్ అంశాన్ని పక్కన పెట్టేసింది.

ఇష్టానుసారంగా నిర్మాణాలు

ప్రస్తుతం సుడా పరిధిలో మాస్టర్‌ప్లాన్ లేకపోవడంతో నిర్మాణాలు ఇష్టానుసారంగా సాగుతున్నాయి. 2008 డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను అనుసరించి నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తున్నారు. ఈ మేరకు కేఎంసీ పరిధిలో వాణిజ్య, వ్యాపార సముదాయాలను రెసిడెన్షియల్ ప్రాంతాల్లో నిర్మిస్తుండడం భవిష్యత్‌లో ఇబ్బందిగా మారనుంది. ఇక కమర్షియల్ ప్రాంతాల్లో రెసిడెన్షియల్ భవనాలను అనుమతులు జారీ అవుతున్నాయి. నగరంలోని రోడ్లు విస్తరించకుండానే నిర్మాణాలు చేపడుతుండటంతో అటు యజమానులు, ఇటు కేఎంసీ యంత్రాంగానికి ఇబ్బందులు తెచ్చిపెట్టే అవకాశముంది.

మంత్రి తుమ్మల దృష్టికి...

ఇటీవల కేఎంసీ కార్యాలయంలో అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఇదే సమయాన కొత్త మాస్టర్‌ప్లాన్ అంశం కూడా చర్చకు రాగా, మంత్రి కొన్ని మార్పులు సూచించారు. ఇల్లెందు క్రాస్‌రోడ్డు, ముస్తఫానగర్ ప్రాంతాన్ని కమర్షియల్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్ కింద మార్చాలని, లకారం, ఖానాపురం చెరువుల తోపాటు మున్నేరు, ధంసలాపురం వద్ద బఫర్ జోన్ డీ మార్క్ చేయాలని తెలిపారు. అలాగే, ప్రకాష్‌నగర్ నుండి ధంసలాపురం రోడ్డు, గోళ్లపాడు ఛానల్ అభివృద్ధి, బొక్కలగడ్డ, వెంకటేశ్వర నగర్ ప్రాంతాల్లో మున్నేరు నది నుండి 50 మీటర్ల మేర బఫర్ జోన్ ఏర్పాటుకు ఆలోచన చేయాలని సూచించారు. దీంతో త్వరలోనే మాస్టర్‌ప్లాన్‌కు మోక్షం లభిస్తుందని నగరవాసులు ఆశిస్తున్నారు.

పాత ప్లాన్‌తోనే అనుమతులు

ఖమ్మం నగరంలో అమల్లో ఉన్న పాత ప్లాన్ ప్రకారమే నిర్మాణ అనుమతులు జారీ చేస్తున్నాం. కొత్త మాస్టర్ ప్లాన్ సిద్ధమై ఆమోదించే వరకు పాతదే అమల్లో ఉంటుంది. ఆ ప్లాన్ ప్రకారం నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

– వికాస్, డీసీపీ, కేఎంసీ

అంగన్‌వాడీలపై భారం..

- విద్యుత్ బిల్లులు మంజూరు చేయని ప్రభుత్వం
- ఏళ్ల తరబడి సొంతంగానే చెల్లిస్తున్న టీచర్లు
- జిల్లాలో నెలకు రూ.4లక్షల మేర బిల్లులు
- ఇకనైనా దారి చూపాలంటున్న ఉద్యోగులు

ఖమ్మంవన్‌టౌన్: చేసేది చిరుద్యోగం, చాలీచాలని జీతం... అన్నీ ముందస్తుగా చెల్లిస్తూ ఎప్పటికో కానీ వచ్చే బిల్లుల కోసం ఎదురుచూసే అంగన్‌వాడీలకు కరెంట్ బిల్లులు మరింత భారం అవుతున్నాయి. తిరిగి వచ్చే విధానం అమల్లో లేకపోవడంతో అంగన్‌వాడీ టీచర్లు సొంతంగానే విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. ఏళ్లుగా ఇదే పరిస్థితి ఉండగా.. తమ ఆవేదన ఎవరికి చెప్పుకోవాలో తెలియక అలాగే, కాలం వెళ్లదీస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉండేది. ఇప్పుడు అలా లేకపోయినా కరెంట్ బిల్లుల విషయంలోనూ కొత్త ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

నెలనెలా అవస్థే

అంగన్‌వాడీ టీచర్లు కేంద్రాలకు సంబంధించి ప్రతినెల కరెంట్ బిల్లు కట్టేందుకు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో ఏడు ప్రాజెక్టులకు గాను 1,837 కేంద్రాలు ఉన్నాయి. ఇందులో కొన్ని అద్దె భవనాల్లో, ఇంకొన్ని సొంత భవనాల్లో, మరికొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్నాయి. భవనం ఏదైనా విద్యుత్ బిల్లుల సమస్య మాత్రం అంతటా ఉంది. కరెంట్ బిల్లులు చెల్లించేందుకు ఏ ప్రభుత్వం ప్రత్యేకంగా గ్రాంట్ ఇవ్వకపోవడంతో జీతంలో నుంచే చెల్లించాల్సి వస్తోందని అంగన్‌వాడీ టీచర్లు వాపోతున్నారు.

పట్టించుకోని గత ప్రభుత్వం

సమస్యలపై ఎన్నిసార్లు పాలకులకు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోలేదని టీచర్లు చెబుతున్నారు. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇరవై రోజుల పాటు ఆందోళన చేసినా గత ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. కాగా, శాఖలన్నింటికీ ప్రభుత్వం ఇతర ఖర్చుల కింద(మిస్‌లేనియస్) కొంత మేర నిధులు కేటాయిస్తుంది. కానీ గర్భిణులు మొదలు శిశువుల ఆలనాపాలన చూసే అంగన్‌వాడీలకు తక్కువ జీతాలు అందుతుండగా.. విద్యుత్ బిల్లులు, ఇతర ఖర్చులకు సైతం గ్రాంట్ అందించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఇప్పుడైనా పరిష్కారమయ్యేనా?

జిల్లాలోని 1,837 అంగన్వాడీ కేంద్రాలకు నెలనెలా రూ.250 నుండి రూ.300 మేర విద్యుత్ బిల్లు వస్తుంది. అంటే జిల్లాలో రూ.4లక్షల మేర బిల్లులను అంగన్‌వాడీ టీచర్లే ఏళ్ల తరబడి చెల్లిస్తున్నారు. తద్వారా ఒక్కో టీచర్ ఏటా రూ.3వేలు కరెంట్ బిల్లుకే ఖర్చు పెట్టాల్సి వస్తుందని వాపోతున్నారు. గత ప్రభుత్వం ఈ సమస్యకు దారి చూపలేదని, ప్రస్తుత ప్రభుత్వమైనా తమ ఆవేదను పట్టించుకోవాలని వారు కోరుతున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం...



అంగన్‌వాడీల్లో విద్యుత్ బిల్లుల సమస్య ఉంది. బిల్లు చెల్లించేందుకు ప్రభుత్వ గ్రాంట్ లేదు. కొన్ని కేంద్రాల్లో మీటర్లు లేకపోవడంతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా రూ.20 లక్షలు మంజూరు చేస్తానని తెలిపారు. ఇప్పటికే మీటర్లు ఉన్న కేంద్రాలతో పాటు కొత్తగా మీటర్లు అమర్చే చోట బిల్లుల చెల్లింపు సమస్యను కలెక్టర్‌కు విన్నవిస్తాం.

– టి.సుమ, జిల్లా సంక్షేమ అధికారి

ప్రపంచ గమనాన్ని మార్చే స్థాయిలో పరిజ్ఞానం

ఖమ్మంరూరల్: ప్రస్తుతం ప్రపంచ గమనాన్ని మార్చే స్థాయిలో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మల్లెంపాటి వీరభద్రరావు అన్నారు. ఖమ్మం రూరల్ మండలం పెదతండాలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం 'సృజనోత్సవ్' మొదలుకాగా ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అన్ని రంగాల్లో ఉత్పాదక శక్తి పెంచి మానవాళి అవసరాలు తీర్చే దిశగా పరిశోధనలు సాగాల్సిన అవసరముందని తెలిపారు. అనంతరం కళాశాల చైర్మన్ కె.నవీన్ మాట్లాడగా విద్యార్థినులు తయారుచేసిన రోబోలు, ఇతర ఆవిష్కరణలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో కన్వీనర్ అట్లూరి వెంకటరమణ, కోఆర్డినేటర్ ఎం.శివకుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.గోపాల్, వి.రామారావు, ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు తయారుచేసిన రోబోను పరిశీలిస్తున్న యాజమాన్యం

క్లుప్తంగా

ఖమ్మం అర్బన్, తల్లాడ జట్ల శుభారంభం



క్రికెటర్లను పరిచయం చేసుకుంటున్న తుమ్మల యుగంధర్

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న రాజీవ్ గాంధీ స్మారక క్రికెట్ టోర్నీలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌ల్లో ఖమ్మం అర్బన్, తల్లాడ జట్లు విజయం సాధించాయి. మొదటి మ్యాచ్‌లో ఖమ్మం అర్బన్ – రఘునాథపాలెం జట్లు తలపడగా బ్యాటింగ్ ఎంచుకున్న ఖమ్మం అర్బన్ జట్టు పరిమిత 15 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన రఘునాథపాలెం జట్టు ఏడు వికెట్లు కోల్పోయి 127 పరుగులు చేసి ఓడిపోయింది. రెండో మ్యాచ్‌లో తల్లాడ, తిరుమలాయపాలెం జట్లు తలపడగా తల్లాడ జట్టు 172 పరుగుల భారీ స్కోర్ చేసింది. అనంతరం తిరుమలాయపాలెం జట్టు ఆశించిన స్థాయిలో పరుగులు చేయలేక 65 పరుగుల తేడాతో ఓడింది. కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్, డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, నిర్వాహకులు ఎండీ మతిన్, అష్రఫ్, నల్లమల ఆనంద్, దుంప రవికుమార్, గౌస్, అక్బర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా అథ్లెటిక్స్ మీట్‌లో రజతం



పతకంతో గౌతమ్

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎ.గౌతమ్ తమిళనాడు రాష్ట్రం చెన్నైలో జరుగుతున్న ఖేలో ఇండియా అథ్లెటిక్స్ మీట్‌లో 200 మీటర్ల విభాగంలో రజత పతకం దక్కించుకున్నాడు. దేశంలోని పలు ప్రాంతాల క్రీడాకారులు పోటీ పడగా జూనియర్స్ విభాగంలో గౌతమ్ 22 సెకండ్లలో లక్ష్యాన్ని సాధించి ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ కోటా అప్పిరెడ్డి, చైర్మన్ ఎం.నిరంజన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ, పీడీ జె.ఉపేందర్, అధ్యాపకులు అభినందించారు.

చేతబడి పేరిట వివాదం!

నేలకొండపల్లి: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్న తరుణాన ఇంకా కొందరు చేతబడి, బాణామతి పేరిట మూఢనమ్మకాలను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలోనే దాడులు చేసుకునే పరిస్థితి ఎదురైన ఘటన నేలకొండపల్లి మండలంలోని చెరువుమాధారంలో వెలుగు చూసింది. గ్రామానికి చెందిన సొసైటీ చైర్మన్ పగిడిపత్తి శ్రీనివాస్ ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. అయితే, గ్రామంలో ఇద్దరు పెద్ద మనుషులు చేతబడి చేయడంతోనే ఆయన మృతి చెందాడంటూ సదరు పెద్ద మనుషులపై గ్రామానికి చెందిన మల్లయ్య దాడి చేశాడు. దీంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు విచారణ జరిపించడంతో పాటు ప్రజల్లో చైతన్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

కుక్కల దాడిలో నలుగురికి గాయాలు

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం వీధి కుక్కలు బీభత్సం సృష్టించాయి. చెరువుమాధారం గ్రామానికి చెందిన ముత్యాలు, కోనాయిగూడెంనకు చెందిన నాగబాబు, లోహిత్, నాచేపల్లిలో కిశోర్‌పై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. వీరికి నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. కాగా, మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల కుక్కల దాడులు పెరుగుతున్నందున అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన ఓ యువతి (22) శుక్రవారం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమె పురుగుల మందు తాగిన విషయాన్ని గుర్తించిన కుటుంబీకులు స్థానికులు నేలకొండపల్లి ఆస్పత్రిలో చికిత్స చేయించి ఖమ్మం తరలించారు. అయితే, సదరు యువతి ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఖమ్మంక్రైం: ఖమ్మం – పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (40) గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన గురువారం రాత్రి రైలు కింద పడగా తీవ్రగాయాలు కావడంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. కాగా, మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 58589 నంబర్‌లో సంప్రదించాలని జీఆర్పీ ఎస్‌ఐ పి.భాస్కర్‌రావు సూచించారు.

ఉత్తములకు ప్రశంసాపత్రాలు

ఖమ్మంసహకారనగర్: జిల్లాలోని వివిధ శాఖల్లో 230 మందిని ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేశారు. వీరికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీఎస్ జగ్జీవన్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ వీపీ గౌతమ్ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, మధుసూదన్, డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్‌సింగ్, ట్రెయినీ ఐపీఎస్ మౌనిక పాల్గొన్నారు.



జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న జిల్లా జడ్జి జగ్జీవన్‌కుమార్, కలెక్టర్ గౌతమ్, పక్కన సీపీ సునీల్‌దత్ తదితరులు



విద్యాచందన, డీఆర్‌డీఓ; ఎ.శ్రీనివాస్, సీపీఓ; విజయనిర్మల, డీఏఓ; ఎం.రాజేశ్వరి, ఐపీటీ రైల్వేస్; టి.సుమ, డీడబ్ల్యూఓ; విజయకుమారి, సహకార అధికారి; ఎస్.అరుణ, కలెక్టరేట్ ఏఓ

వి.మదన్‌గోపాల్, ఓఎస్‌ఈ; ఆర్.రాంబాబు, సూపరింటెండెంట్; సత్యనారాయణ, ఎంసీహెచ్; బి.నాగేశ్వరరావు, ఓఎస్‌డీ; సీహెచ్ స్వామి, తహసీల్దార్; వెంకటేశ్వర్లు, తహసీల్దార్; శ్రీనివాసరావు, తహసీల్దార్



డి.కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీఓ; ఎం.చంద్రశేఖర్, ఎంపీడీఓ; టి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ; సీహెచ్.శ్రీనివాసరావు, ఎంపీడీఓ; బి.జయరాం, ఎంపీడీఓ; ఎస్‌కే. జానీమియా; జి.మల్లికార్జున్ రావు; బి.శ్రీనివాస్, వెటర్నటీ అసిస్టెంట్; డి.స్వరూపారాణి, ఎక్సైజ్ కానిస్టేబుల్; పి.విజయకుమార్, ఎక్సైజ్ కానిస్టేబుల్; ఈ.శ్రీనివాసరావు, హెచ్‌డబ్ల్యూఓ; జీవీ షర్మిల, సూపర్‌వైజర్; ఎం.కోమలి, హెచ్‌డబ్ల్యూఓ; జి.నగేశ్, హార్టికల్చర్ ఆఫీసర్; డి.మధుసూదన్, హెడ్ కానిస్టేబుల్

వి.నాగేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్; కె.రామారావు, హెడ్ కానిస్టేబుల్; భూపతి నీలిమ, జూనియర్ అసిస్టెంట్; జి.ప్రసాద్, ఏడీ, డ్రగ్స్ కంట్రోల్; ఎం.పద్మావతి, ప్రిన్సిపాల్; ఎం.వీరస్వామి, ఫైర్‌మెన్; ఎం.మిషాక్, సూపరింటెండెంట్; జి.నిరోష, ప్రిన్సిపాల్; సంతోష్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్; ఆర్.విజయలక్ష్మి, ఎంవీఐ; మురళీధర్‌రావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్; డి.రవీందర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్; కె.రవికుమార్, కోఆర్డినేటర్; కుమారస్వామి, డీడీ; టి.కాంతారావు, జూనియర్ అసిస్టెంట్

వి.నీలోహన, సీనియర్ అసిస్టెంట్; ఆర్.అవినాష్, మెడికల్ ఆఫీసర్; ఎస్.చందన, మెడికల్ ఆఫీసర్; ఎం.రవిచంద్ర ప్రకాష్, ఏఈఓ; కె.రాజేశ్, ఏఈఓ; బి.వసుంధర, ఏఈఓ; కె.రాంబాబు, ఆయుష్ శాఖ; జి.వీరయ్య, ఇంటెలిజెన్స్ శాఖ; కె.అనిల్‌కుమార్, ఇంటలిజెన్స్ శాఖ; ఎస్.కే.నస్రీన్, సీనియర్ అసిస్టెంట్; వీఆర్‌వీ.ప్రవంతి, సత్తుపల్లి ఆస్పత్రి; రాజేశ్వరరావు, మెడికల్ కాలేజీ; డి.వీరభద్రం, దేవాదాయ శాఖ; మాధవి దుర్గారాణి, డిప్యూటీ ఈఈ; ఎం.వేలాద్రి, సబ్ ట్రెజరీ ఆఫీసర్

డి.స్వాతి, ఏఈఓ; ఎన్.సునీత, డీఆర్‌డీఓ; ఏ.శ్రీరాణి, ఏపీఓ; జి.రాజకుమారి, ఇరిగేషన్ శాఖ; ఎం.వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ శాఖ; జె.రాంప్రసాద్, ఇరిగేషన్ శాఖ; ఏ.రవికుమార్, డీఆర్‌ఓ; పి.కిశోర్‌కుమార్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్; ఎండీ మొయిని, జూనియర్ అసిస్టెంట్; కె.రాజు, కలెక్టరేట్; వీరభద్రనాయక్, డీటీ; కేవీవీ.ప్రసాద్, ఆర్ఐ; పి.ఉష, ఆర్ఐ, చింతకాని; ఎస్‌కే తాజుద్దీన్, డీపీఆర్‌ఓ ఆఫీస్; బి.శ్రీనివాసరావు, వాచ్‌మెన్

సత్యనారాయణరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్; ఎ.జ్యోతి, సీనియర్ అసిస్టెంట్; వి.ప్రభాకర్‌రావు, డీఎల్‌పీఓ; ఎం.రామచందర్, ఎంపీఓ; రవీంద్రప్రసాద్, ఎంపీఓ; మజీద్, డిప్యూటీ స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్; మాలతి, స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్; ఎన్.సంధ్య, ఎస్ఐ; బి.దామోదర్, కానిస్టేబుల్; కె.నాగేంద్రమ్మ, కానిస్టేబుల్; కె.శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్; సీహెచ్.నాగేశ్వరరావు, ఏఎస్ఐ; ఏ.విష్ణుమూర్తి, ఏఎస్ఐ; సయ్యద్ హుస్సేన్, హెడ్ కానిస్టేబుల్; వి.భద్రునాయక్, ఎస్ఐ



లక్ష్మణ్‌రావు, ఏఆర్ ఎస్ఐ; జి.ప్రసాద్, ఏఆర్ ఎస్ఐ; కిరణ్‌కుమార్, ప్రభుత్వాస్పత్రి; బి.శ్రీను, డీఆర్‌ఓ; ఎం.వేణుమాధవ్, ఎఫ్ఆర్‌ఓ; జి.ఉపేంద్రమ్మ, మెప్మా



ప్రశంసాపత్రం అందుకున్న సీతంపేట, కోటపాడు, యాతాలకుంట గ్రామపంచాయతీల బాధ్యులు



గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు



ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల శకటం



నృత్యం చేస్తున్న కృష్ణప్రసాద్ మెమోరియల్ పాఠశాల విద్యార్థులు

ప్రభుత్వ కార్యాలయాల్లో గణతంత్ర దినోత్సవం

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరించారు. జిల్లా కోర్టులో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీఎస్ జగ్జీవన్‌కుమార్ ముమ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించారు. న్యాయమూర్తులు కె.ఉమాదేవి, కె.ఆశారాణి, మహ్మద్ అబ్దుల్ జావీద్ పాషా, ఆర్.శాంతిలత, కె.దీప, వి.మాధవి, పి.గోపికా నాగశ్రావ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ఇక కలెక్టర్ వీపీ గౌతమ్ తన క్యాంపు కార్యాలయంలో, కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ జాతీయ జెండా ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, కలెక్టరేట్ ఏఓ అరుణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. పోలీస్ కమిషనరేట్‌లో సీపీ సునీల్‌దత్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అడిషనల్ డీసీపీలు కుమారస్వామి, ప్రసాద్‌రావు, కుమారస్వామి, ట్రెయినీ ఐపీఎస్ పి.మౌనిక, ఏసీపీలు హరికృష్ణ, గణేశ్, సారంగపాణి, రెహమాన్, నర్సయ్య, సుశీల్‌సింగ్, కృపాకర్ పాల్గొన్నారు. ఇక పార్టీ కార్యాలయాల్లో నాయకులు జాతీయ పతాకాలను ఆవిష్కరించి మాట్లాడారు.



ఖమ్మంలీగల్: కోర్టులో జెండా ఆవిష్కరిస్తున్న ప్రధాన న్యాయమూర్తి జగ్జీవన్‌కుమార్



ఖమ్మంవ్యవసాయం: డీసీసీబీ కార్యాలయంలో సీఈఓ రెహమాన్, చైర్మన్ కూరాకుల



ఖమ్మంగాంధీచౌక్: జెండా ఎగురవేస్తున్న దేవాదాయ శాఖ ఏసీ సులోచన



కమిషనరేట్‌లో జెండా వందనం సీపీ సునీల్‌దత్, తదితరులు



కేఎంసీలో జెండా వందనం చేస్తున్న కమిషనర్ ఆదర్శ్, మేయర్ తదితరులు



సీపీఐ కార్యాలయంలో జెండా వందనం సమర్పిస్తున్న నాయకులు



బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో గణతంత్ర వేడుకలు..



బీజేపీ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ



కాంగ్రెస్ ఆఫీస్‌లో జాతీయ జెండా ఎగురవేస్తున్న డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

కాంగ్రెస్ వర్గీయుల మధ్య ఘర్షణ

తల్లాడ: తల్లాడలో గణతంత్ర దినోత్సవ వేడుకల వేదిక వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు ఘర్షణ పడ్డారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. తల్లాడ రింగ్ రోడ్డు సెంటర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యాన జాతీయ పతాకాన్ని ఎగురవేయగా, ఇరువర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆ తర్వాత కార్యకర్తలు కోసూరి వెంకటేశ్వరరావు, షేక్ జమాల్ మధ్య కమిటీల్లో ప్రాధాన్యత విషయంపై వాగ్వాదం మొదలైంది. కమిటీలో తనకు ప్రాధాన్యత ఇవ్వటం లేదని, కార్యక్రమాలకు కూడా పిలవడం లేదని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ క్రమంలో జమాల్ మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్ ఆధ్వర్యాన మాట్లాడుకుందామని పిలిపించగా ఆయనకు ఏం బాధ్యత ఉందని పిలుస్తున్నారంటూ కోసూరి ప్రశ్నించగా ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి కొట్టుకున్నారు. అక్కడే నాయకులు గోపిశెట్టి వెంకటేశ్వరరావు, కాపా సుధాకర్ మధ్య తీవ్ర వాగ్వాదం జరగగా... పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ఘర్షణ సందర్భంగా గుమికూడిన పార్టీశ్రేణులు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వైరారూరల్: మండలంలోని పాలడుగు వద్ద స్కూటీని ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. విజయవాడ రామకోటినగర్‌కు చెందిన మెడికల్ రిప్రెజెంటేటివ్ పువ్వాడ పరమేశ్వరరావు శుక్రవారం వైరాలోని మెడికల్ షాపుల్లో మందులు సరఫరా చేశాక స్కూటీపై విజయవాడ వెళ్తున్నాడు. ఈ క్రమంలో పాలడుగు వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో ఆయన కాలు విరిగింది. దీంతో 108 సిబ్బంది చేరుకుని ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

29 నుంచి రేమిడిచర్ల రైల్వే గేట్లు మూసివేత

ఎర్రుపాలెం: మండలంలోని రేమిడిచర్ల సమీపంలోని రెండు రైల్వే గేట్ల వద్ద మరమ్మతుల కారణంగా ఈ నెల 29వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మూసివేయనున్నట్లు తహసీల్దార్ ఉషాశారద తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించి ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని సూచించారు.

షార్ట్ సర్క్యూట్‌తో రెండు గృహాలు దగ్ధం

కల్లూరురూరల్: కల్లూరు మండలం తెలగవరం, మర్లపాడు గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండు ఇళ్లు కాలిపోయాయి. మేడేపల్లి వెంకమ్మ, గర్నెపుడి రామకోటికి చెందిన ఇళ్లలో మంటలు చెలరేగగా ఫైర్ ఇంజన్ వచ్చేలోగానే ఇళ్లలోని సామగ్రి కాలి బూడిదయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ సాంబశివుడు సూచనలతో ఆర్ఐ స్టాలిన్ చేరుకుని నష్టంపై అంచనా వేయడమే కాక తక్షణ సాయంగా 25 కిలోల చొప్పున బియ్యం అందజేశారు.



కాలిపోయిన ఇంటి వద్ద ఆర్ఐ, తదితరులు

కమలం కసరత్తు తెలంగాణ నుంచే

- రేపు దేశంలోనే తొలి బీజేపీ లోక్‌సభ క్లస్టర్ సమావేశం
- మహబూబ్‌నగర్ భేటీకి హాజరుకానున్న అగ్రనేత అమిత్ షా
- ఎన్నికల కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్న కేంద్రమంత్రి



29న భేటీలకు ఛుగ్, మీనన్

సాక్షి, హైదరాబాద్: బీజేపీ పార్లమెంటు ఎన్నికల కసరత్తు తెలంగాణ నుంచే ప్రారంభం కానుంది. దేశవ్యాప్తంగా ఎంపీ సీట్లను 143 క్లస్టర్లు (మూడు, నాలుగేసి సీట్ల చొప్పున)గా, రాష్ట్రంలోని 17 సీట్లను 5 క్లస్టర్లుగా పార్టీ విభజించింది. ఈ నేపథ్యంలో దేశంలోనే మొట్టమొదటిసారిగా మహబూబ్‌నగర్‌లో ఆదివారం నిర్వహించనున్న క్లస్టర్ (మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్లగొండ ఎంపీ సీట్లు) ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశానికి బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరుకానున్నారు. అలాగే కరీంనగర్ క్లస్టర్ (కరీంనగర్, జహీరాబాద్, మెదక్, చేవెళ్ల స్థానాలు)కు చెందిన కరీంనగర్ ఎంపీ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ బూత్, ఆ పైస్థాయి కార్యకర్తలు దాదాపు 20 వేల మందితో భేటీ కానున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో మహిళా వృత్తి నిపుణులు, వివిధ రంగాల ప్రముఖులు, మేధావులతోనూ సమావేశం కానున్నారు.

వచ్చే ఏప్రిల్ లేదా మేలో లోక్‌సభ ఎన్నికలు జరగొచ్చుననే అంచనాల నేపథ్యంలో పూర్తిస్థాయి సన్నద్ధతపై పార్టీ నాయకత్వం దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా ఆదివారం అమిత్ షా పాలమూరులో వచ్చే ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన కార్యాచరణ, వ్యూహంపై నాయకులు, కార్యకర్తలకు వివరించనున్నారు. కరీంనగర్‌లో.. పోలింగ్ బూత్ కమిటీ, ఆ పైస్థాయి కార్యకర్తలు ఇంటింటికీ (జనసంపర్క్ అభియాన్) వెళ్లి పదేళ్లలో మోదీ సర్కార్ సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రచారం నిర్వహించి, కమలం గుర్తుకు ఓటేయాల్సిందిగా కోరేలా దిశానిర్దేశం చేయనున్నారు. హైదరాబాద్‌లో జరిగే మహిళా వృత్తినిపుణుల సమ్మేళనంలోనూ బీజేపీ అధికారంలోకి వచ్చాక చేపట్టిన కార్యక్రమాలు వివరించడం ద్వారా మహిళల మద్దతును కూడగట్టే ప్రణాళికను అమలు చేయనున్నారు. దీనికి కొనసాగింపుగా ఈ నెల 29న జరిగే కరీంనగర్ క్లస్టర్ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశానికి పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్ హాజరుకానున్నారు. అదేరోజు ఆదిలాబాద్ ఎంపీ క్లస్టర్ (ఆదిలాబాద్, పెద్దపల్లి, నిజామాబాద్ సీట్లు) పరిధిలో నిర్వహించనున్న ఎన్నికల నిర్వహణ కమిటీ భేటీలో జాతీయ కార్యదర్శి, రాష్ట్ర సహ ఇన్‌చార్జి అర్వింద్ మీనన్ పాల్గొననున్నారు.

టికెట్లకు పోటీ

ఒకవైపు పార్టీ ఎన్నికలకు సమాయత్తం అవుతుంటే మరో టికెట్ల కోసం పార్టీలో తీవ్ర పోటీ నెలకొంది. అయితే సికింద్రాబాద్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్‌లో సిట్టింగ్ ఎంపీలనే మళ్లీ పోటీకి దింపే అవకాశాలున్నాయని తెలుస్తోంది. మిగతా 13 స్థానాల్లో వివిధ రూపాల్లో నిర్వహించే సర్వేల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారని సమాచారం. మోదీ ఆకర్షణ, అభివృద్ధి నినాదం పనిచేస్తుందన్న అంచనాల నేపథ్యంలో.. తెలంగాణలో మెజారిటీ ఎంపీ సీట్లలో బీజేపీ గెలిచే అవకాశాలున్నాయని పార్టీ నాయకత్వం ధీమా వ్యక్తం చేస్తోంది. రాష్ట్రంలోని అయిదారు మంది సిట్టింగ్ ఎంపీలు బీజేపీ వైపు చూస్తున్నట్టు బీజేపీ నేతలు చెబుతున్నారు. వారు ఇప్పటికే పార్టీ నాయకత్వంతో టచ్‌లోకి వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఇలావుండగా రాష్ట్రంలోని మొత్తం 17 సీట్లలో 5 బీసీలకు, 3 రెడ్డి, 5 ఎస్సీ.. ఎస్టీ, వెలమ, కమ్మ, బ్రాహ్మణ, లింగాయత్ లేదా వైశ్య సామాజిక వర్గాలకు ఒక్కొక్కటి చొప్పున కేటాయించే అవకాశాలున్నాయని పార్టీ వర్గాల విశ్వసనీయ సమాచారం.

అమిత్ షా పర్యటన షెడ్యూల్

- ఆదివారం ఢిల్లీ నుంచి ఐఏఎఫ్ ప్రత్యేక విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 1.05 నిమిషాలకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- అక్కడి నుంచి బీఎస్ఎఫ్ హెలికాప్టర్‌లో 1.40కి మహబూబ్‌నగర్‌కు చేరుకుంటారు.
- 2.40 దాకా సుదర్శన్ ఫంక్షన్ హాల్లో జరిగే క్లస్టర్ మీటింగ్‌లో పాల్గొంటారు
- తర్వాత హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 3.55కు కరీంనగర్‌కు చేరుకుంటారు.
- సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య ఎస్ఆర్ఆర్ కాలేజీలో జరిగే సమావేశంలో పాల్గొంటారు.
- 6 గంటలకు హైదరాబాద్ చేరుకుని, 6.15 నుంచి 7.05 వరకు జేఆర్‌సీ కన్వెన్షన్ హాలులో మహిళా వృత్తి నిపుణులు, ఇతరులతో భేటీ అవుతారు.
- రాత్రి 7.45 గంటలకు ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళతారు.

యుద్ధానికి 'సిద్ధం'!

నేడు 'భీమిలి'లో ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్న ఏపీ సీఎం జగన్

- 175కు 175 అసెంబ్లీ, 25కు 25 లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యం
- టీడీపీ–జనసేన పొత్తుల జిత్తులు.. కుతంత్రాలను చిత్తు చేసేందుకు శ్రేణులకు దిశానిర్దేశం



సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం/తగరపువలస (విశాఖ జిల్లా) : రాష్ట్రంలో రానున్న ఎన్నికల కురుక్షేత్ర యుద్ధంలో 175కు 175 శాసనసభ, 25కు 25 లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికల శంఖారావాన్ని పూరించేందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధమయ్యారు. ప్రజాక్షేత్రంలో వైఎస్సార్‌సీపీని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఒంటరిగా ఎదుర్కోలేక జనసేన సహా వివిధ పార్టీల జెండాలతో జతకట్టి.. కుటుంబాలను చీల్చుతూ పన్నుతున్న కుట్రలు, కుతంత్రాలను చిత్తుచేసి, విజయభేరి మోగించడానికి.. పార్టీ శ్రేణులను సిద్ధం చేయడానికి ఆయన నడుం బిగించారు. ఇందుకు 'సిద్ధం' పేరుతో రాష్ట్రంలో నాలుగు ప్రాంతాల్లో నాలుగు చోట్ల పార్టీ శ్రేణులతో భారీ బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మొదటి సభను ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గం సంగివలసలో శనివారం నిర్వహిస్తున్నారు. ఈ సభకు ఉత్తరాంధ్రలోని 34 నియోజకవర్గాల నుంచి భారీఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరుకానున్నారు. సుమారుగా 15 ఎకరాల స్థలంలో ఈ భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభలో పార్టీ కార్యకర్తలనుద్దేశించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగిస్తారు. అంతేకాక.. నియోజకవర్గాల వారీగా పలువురు కార్యకర్తలతో కూడా సీఎం ముఖాముఖి మాట్లాడనున్నారు. ఇక మ.3.30 గంటల నుంచి సా.5 వరకూ ఈ బహిరంగ సభ జరుగుతుంది.

నిధులైనా... విధులైనా...

▶ మొదటి పేజీ తరువాయి

పనులూ చేశారు. పంచాయతీల్లో నిధులు లేకున్నా.. చాలా మంది సర్పంచులు సొంత డబ్బుతోనో, అప్పులు తెచ్చో పనులు పూర్తి చేయించారు.

గడువు ముగుస్తుండటంతో..

ప్రస్తుతం గ్రామాల్లో సర్పంచులు, పాలకవర్గాల పదవీకాలం ఫిబ్రవరి 1వ తేదీతో ముగుస్తోంది. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పటికిప్పుడు గ్రామ పంచాయతీ (జీపీ) ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా లేనట్టు సంకేతాలు ఇచ్చింది. ఏప్రిల్, మే నెలల్లో లోక్‌సభ ఎన్నికలు ఉండటంతో.. అవి ముగిశాక పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. సర్పంచుల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో.. వారినే మరో ఆరు నెలలు కొనసాగించేందుకు, లేదా వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బందిని గ్రామాలకు ప్రత్యేక అధికారులుగా నియమించేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుత సర్పంచులలో చాలా వరకు బీఆర్ఎస్‌కు అనుకూలమైనవారేనన్న ఆలోచనతో ఉన్న కాంగ్రెస్ సర్కారు.. వారినే ఇన్‌చార్జులుగా కొనసాగించేందుకు సుముఖంగా లేనట్టు సంకేతాలు ఇచ్చింది. వచ్చే ఆరు నెలల పాటు (పంచాయతీ ఎన్నికలు పూర్తయ్యేదాకా) గ్రామాల్లో పాలన బాధ్యతను ప్రత్యేకాధికారులకు అప్పగించేందుకు మొగ్గుచూపుతోంది. ఇది సర్పంచులలో కలకలం రేపుతోంది.

'ప్రత్యేక'పాలనతో ఇబ్బందులేనంటూ..

ఫిబ్రవరి 2వ తేదీ నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన మొదలవబోతోందంటూ జిల్లా, మండల స్థాయిలో అధికారులు హడావుడి చేస్తున్నారని సర్పంచులు అంటున్నారు. సొంత నిధులతో కొత్త పంచాయతీ భవనాలు, శ్మశానవాటికలు, క్రీడా మైదానాలు వంటివి నిర్మించామని.. ఉపాధి హామీ, ప్రత్యేక అభివృద్ధి నిధి, రాష్ట్ర ఆర్థిక సంస్థ పరిధిలోని పనులు చేపట్టామని చెప్తున్నారు. తమ పదవీకాలం ముగిసేలోగా పెండింగ్ బిల్లులైనా ఇప్పించాలని, లేదా ఎన్నికలు జరిగేదాకా సర్పంచ్‌లుగా కొనసాగించాలని సీఎం రేవంత్‌రెడ్డికి, పంచాయతీరాజ్ మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేస్తున్నారు. తాము రాజకీయ పార్టీల గుర్తులపై ఎన్నికకాలేదని, తమను ఒక రాజకీయపక్షానికే అనుకూలమైన వారిగా పరిగణించవద్దని కోరుతున్నారు. తమను క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై ప్రభుత్వపరంగా అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించేవారిగా గుర్తించాలని అంటున్నారు. ప్రత్యేకాధికారుల పాలన అంటే ఇబ్బందేనని.. గ్రామాల్లో అభివృద్ధి జరగదని సర్పంచులు పేర్కొంటున్నారు. అధికారులు కేవలం ఆఫీస్ వేళల్లోనే అందుబాటులో ఉంటారని.. వారాంతాలు, సెలవు రోజుల్లో వారిని సంప్రదించే అవకాశమే ఉండదని చెప్తున్నారు. దీనితో ప్రజలకు సమస్యలు వస్తాయని పేర్కొంటున్నారు.

గ్రాంట్లపై ఆధారపడిన చోట సమస్య ఎక్కువ

ఏడాదికిపైగా పెండింగ్ బిల్లుల సమస్య వెంటాడుతోందని.. సొంత నిధులతో చేసిన పనులకు బిల్లులు రాక ఇబ్బందిపడుతున్నామని సర్పంచ్‌లు చెప్తున్నారు. సొంత ఆదాయ వనరులు అధికంగా ఉన్న పలు మేజర్ గ్రామ పంచాయతీలు, పెద్ద గ్రామాల్లో ఇబ్బంది పెద్దగా లేదని.. ఆదాయ వనరులు అంతగా లేని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, గ్రాంట్లపై ఆధారపడిన మధ్య, చిన్న తరహా గ్రామాలకు సమస్య ఎక్కువగా ఉందని అంటున్నారు. ఇలాంటి గ్రామ పంచాయతీల్లో రూ.6 లక్షల నుంచి రూ.11 లక్షల దాకా పెండింగ్ బిల్లులు ఉన్నాయని.. మొత్తంగా రూ.1,200 కోట్ల మేర బకాయిలు ఉండొచ్చని సర్పంచుల సంఘాలు అంచనా వేస్తున్నాయి. గతంలో రాష్ట్ర ఆర్థిక సంఘం, ఇతర అభివృద్ధి నిధులు సకాలంలో విడుదలకాకపోవడంతోపాటు నిధుల వ్యయంపై ఫ్రీజింగ్ పెట్టడంతో పెండింగ్ బిల్లుల సమస్య పెరిగిందని అంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి 15వ ఆర్థికసంఘం నిధులు నేరుగా పంచాయతీలకే అందడంతో.. కొందరు సర్పంచులు కొంతమేర బిల్లులు రాబట్టుకోగలిగారని చెప్తున్నాయి.

కొనసాగిస్తే భరోసా!

గతంలో సకాలంలో బిల్లులు రాక, అభివృద్ధి, ఇతర పనుల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక, ఇతర కారణాలతో పలువురు సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్నారని సర్పంచుల సంఘాలు గుర్తుచేస్తున్నాయి. అందువల్ల పెండింగ్ బిల్లులపై ప్రభుత్వం వెంటనే ఏదైనా హామీ ఇవ్వాలని కోరుతున్నాయి. లేకుంటే పంచాయతీలకు ఎన్నికలు జరిగేదాకా ఇప్పుడున్నవారినే కొనసాగిస్తే పెండింగ్ బిల్లుల రాకపై సర్పంచులకు భరోసా ఉంటుందని స్పష్టం చేస్తున్నాయి.

పెండింగ్ బిల్లుల సమస్యను వెంటనే పరిష్కరించాలి: యాదయ్యగౌడ్

ఫిబ్రవరి 1న తమ పదవీకాలం ముగుస్తున్నందున పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సీఎం రేవంత్‌రెడ్డిని తెలంగాణ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ఒక ప్రకటనలో కోరారు. సర్పంచులు అప్పులు తెచ్చి గ్రామాభివృద్ధికి పాటుపడ్డారని, అలాంటి వారి సమస్యలకు రాజకీయ రంగు రుద్దవద్దని విజ్ఞప్తి చేశారు. వివిధ పనులు చేసిన బిల్లులు రాక, తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బందిపడుతున్నామని.. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.

రాజ్యాంగ స్ఫూర్తితో సంక్షేమ బాటలో

- గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
- 99.5 శాతం ఎన్నికల వాగ్దానాలను అమలు చేశాం
- 56 నెలలుగా కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా రాష్ట్రంలో సంక్షేమ పాలన



"మా ప్రభుత్వం మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావిస్తూ 99.5 శాతం హామీలను అమలు చేసింది. కులమతాలు, ప్రాంతాలు, రాజకీయ వివక్ష లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందిస్తూ మన రాష్ట్రాన్ని దేశంలో ప్రత్యేకంగా నిలిపింది. విజయవాడ నడిబొడ్డున 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుతో నా ప్రభుత్వం సామాజిక న్యాయ సాధనను పునరుద్ఘాటించింది. సామాజిక సాధికారత నినాదం కాదు.. మార్గదర్శక విధానమని నిరూపించింది"

– జస్టిస్ అబ్దుల్ నజీర్, గవర్నర్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తితో సంక్షేమ ప్రగతి దిశగా పయనిస్తోందని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. గత 56 నెలలుగా లౌకిక, ప్రజాస్వామిక, గణతంత్ర విలువలను ప్రతిబింబిస్తూ పాలన సాగిస్తోందన్నారు. అణగారిన వర్గాల్లో ఆనందాన్ని నింపడమే లక్ష్యంగా మారుమూల ప్రాంతాలకూ అభివృద్ధి ఫలాలను చేరవేస్తున్నట్లు చెప్పారు. సచివాలయాల వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పౌర సేవలను చేర్చి గ్రామ స్వరాజ్య భావనకు జీవం పోశామన్నారు. ఇప్పటి వరకు డీబీటీ ద్వారా రూ.2,52,943.48 కోట్లు, నాన్– డీబీటీ ద్వారా మరో రూ.1,68,151.08 కోట్లు కలిపి మొత్తం రూ.4,21,094.56 కోట్ల మేర ప్రజలకు ప్రయోజనం చేకూర్చినట్లు తెలిపారు. సంక్షేమంతో పాటు సామాజిక విప్లవాన్ని తెస్తూ నామినేటెడ్ పనులు, పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలతో పాటు మహిళలకు ప్రత్యేకంగా 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. విద్య, వైద్య రంగాల్లో చరిత్రాత్మక మార్పులు తెచ్చిందని చెప్పారు. పుష్కలమైన వనరులు, అపార అవకాశాలతో ఏపీ పారిశ్రామికవేత్తలకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారిందన్నారు. యువత నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా నిరుద్యోగం రేటు వేగంగా తగ్గిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జీవనాధారమైన పోలవరం ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యంగా పూర్తి చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. శుక్రవారం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు గవర్నర్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

జిల్లా వార్తలు

ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపిక



మోహన్‌కుమార్



నరుకుళ్ల త్రినాథ్

దమ్మపేట: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలానికి చెందిన ఇద్దరు పోలీసు అధికారులు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఇండియన్ పోలీస్ మెడల్స్‌కు ఎంపికయ్యారు. మండలంలోని పట్వారిగూడెంనకు చెందిన శ్రీరాముల మోహన్‌కుమార్ (ఏసీపీ, పంజాగుట్ట), నాచారానికి చెందిన నరుకుళ్ల త్రినాథ్(ఎస్‌పీఎఫ్ కమాండెంట్, హైదరాబాద్) అవార్డులకు ఎంపికైనట్లు కేంద్రం ప్రకటించింది. ఇందులో మోహన్‌కుమార్ పోలీస్ శాఖలో ఎస్‌ఐగా ఉద్యోగం ప్రారంభించి ప్రస్తుతం ఏసీపీ స్థాయికి ఎదగగా హైదరాబాద్ పంజాగుట్టలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక నరుకుళ్ల త్రినాథ్ సైతం ఎస్‌ఐగానే ప్రస్థానం ప్రారంభించి ఇప్పుడు హైదరాబాద్‌లో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కమాండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా మోహన్, తినాథ్‌ను జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, నాయకులు చిన్నశెట్టి యుగంధర్, యర్రగొర్ల రాధాకృష్ణ, సాయిల నర్సీ, దారా యుగంధర్, పగడాల రాంబాబు, కొయ్యల అచ్యుతరావు తదితరులు అభినందించారు.

64 రోజుల్లో 160 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి

- ఉద్యోగులు, కార్మికులు సింగరేణి అభివృద్ధికి పాటుపడాలి
- గణతంత్ర వేడుకల్లో సింగరేణి సీఎండీ బలరామ్



జీఎం కట్టా బసవయ్యను సన్మానిస్తున్న సీఎండీ, డైరెక్టర్లు



జాతీయ జెండాకు వందనం సమర్పిస్తున్న సీఎండీ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థల్లోని కార్మికులు మొదలు అధికారుల వరకు అంతా కంపెనీ తమదేనని భావించి అభివృద్ధికి పాటుపడాలని సీఎండీ ఎన్.బలరామ్ సూచించారు. కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎండీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ఉత్తమ అధికారులు, ఉద్యోగులను సన్మానించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంస్థ రూ.కోట్లు వెచ్చించి తెచ్చిన యంత్రాలు సగటున 14 గంటలు పనిచేయడం లేదని.. అదే ఓబీ కాంట్రాక్టర్లు రోజుకు 20 గంటలు మేర వినియోగిస్తున్నారని తెలిపారు. ఇకనైనా యంత్రాల వినియోగాన్ని పెంచి ఉత్పత్తి లక్ష్యాలు చేరుకోవాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం సింగరేణిలో 700 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం కాగా, మిగిలిన 64 రోజుల్లో 160 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధనకు కృషి చేయాలని చెప్పారు. కాగా, తాను సీఎండీగా బాధ్యతలు స్వీకరించాక గనులు, ఆస్పత్రులను తనిఖీ చేయగా పలు చోట్ల లోపాలు బయటపడ్డాయని వెల్లడించారు. ఇకనైనా ఉద్యోగులు తీరు మార్చుకోకపోయినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా వేటు తప్పదని హెచ్చరించారు. ఇక కార్మికులు కూడా ఉత్పత్తికి కృషి చేస్తూనే కంపెనీ ఆస్తుల పరిరక్షణలో పాలుపంచుకోవాలని సూచించారు. కారుణ్య నియామకాల్లో దళారుల పాత్ర లేకుండా అధికారులు అన్ని చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

వచ్చే ఏడాది నాలుగు కొత్త గనులు

వచ్చే ఏడాది సింగరేణి పరిధిలో నాలుగు కొత్త గనులు ప్రారంభం కానున్నాయని సీఎండీ బలరామ్ తెలిపారు. ఒడిశాలోని నైనీ బ్లాక్‌లో ఉత్పత్తి మొదలయ్యేలా ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. కాగా, సింగరేణిలో ప్రతీ ఉద్యోగి వారి ఇళ్లలో శుభకార్యాలు, ఇతర ప్రత్యేక సందర్భాల్లో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఇక రక్షణ, నాణ్యత పాటిస్తూ లక్ష్య సాధనకు అందరూ కృషి చేసి, సింగరేణి కీర్తిని ఇనుమడింపజేయాలని సీఎండీ సూచించారు. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు ఎన్వీకే.శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి, సత్యనారాయణరావు, జీఎంలు కట్టా బసవయ్య, సురేశ్‌తో పాటు కార్మిక సంఘాల నాయకులు రాజ్‌కుమార్, త్యాగరాజన్ పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలకు ఆదర్శంగా రాజ్యాంగం

భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలంఅర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం జాతీయ జెండా ఆవిష్కరించాక మాట్లాడారు. దేశ ప్రజలకు స్వేచ్ఛను ప్రసాదించేందుకు పోరాడిన అల్లూరి సీతారామరాజు, కుమురం భీమ్ తదితరులు ఆదర్శప్రాయులన్నారు. ఐటీడీఏ ద్వారా ఏజెన్సీ ప్రాంత గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. గిరిజన విద్యార్థులు పరీక్షల్లో సత్తా చాటేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వేడుకల్లో పీఓ సతీమణి రీచాజైన్, అధికారులు మణెమ్మ, డేవిడ్‌రాజ్, శివాజీ, తానాజీ, విజయ్‌కుమార్, టి.వెంకటేశ్వరరాజు, ఉదయ్‌భాస్కర్, ఎస్.సురేశ్‌బాబు, అశోక్, హరికృష్ణ, బి.నాగులు, చలపతి, సారాచంద్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ జెండాను ఆవిష్కరించిన ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్

విద్యార్థులను ఉత్సాహపరిచిన పీఓ

సాదాసీదాగా ఉండటాన్నే ఇష్టపడే పీఓ ప్రతీక్‌జైన్ మరోమారు తన ప్రత్యేకతను చాటారు. భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలో శుక్రవారం జరిగిన రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా విద్యార్థులకు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. పీఓ ప్రతీక్‌జైన్, ఆయన సతీమణి రీచా, అధికారులు ఈ ప్రదర్శనలు వీక్షించేందుకు కుర్చీలు ఏర్పాటు చేశారు. కానీ పీఓ మాత్రం కుర్చీలు తీసివేయించి తన సతీమణి, అధికారులతో సహా నేలపై కూర్చుని సాంస్కృతిక కార్యక్రమాలు తిలకిస్తూ విద్యార్థులను ఉత్సాహపరిచారు.



నేలపై కూర్చుని సాంస్కృతిక ప్రదర్శనలు తిలకిస్తున్న పీఓ

ప్రతిభ చాటిన తపాలా ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు

ఖమ్మంగాంధీచౌక్: తపాలా పథకాల అమలులో ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు శుక్రవారం ఖమ్మం తపాలా డివిజన్ కార్యాలయంలో పోస్టల్ సూపరింటెండెంట్ రవికుమార్ ప్రశంసాపత్రాలు అందజేశారు. 2023 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు పథకాల అమలును ప్రామాణికంగా తీసుకున్న అధికారులు పలువురిని ఎంపిక చేశారు. ఈ మేరకు ప్రశంసాపత్రాలు అందుకున్న ఉద్యోగుల వివరాలిలా ఉన్నాయి. అత్యధికంగా పీఓఎస్‌బీ అకౌంట్లు తెరిపించిన వారిలో ఆర్.సంతోష్ (పోస్టుమాస్టర్, కొత్తగూడెం), కె.కిరణ్‌కుమార్‌రెడ్డి (పోస్టుమాస్టర్, ఖమ్మం హెడ్ పోస్టాఫీస్), ఎన్.ఉపేందర్ (సబ్ పోస్టుమాస్టర్, పాల్వంచ) ఉన్నారు. అలాగే, ఎస్‌బీ అకౌంట్స్ బ్రాంచ్ విభాగంలో అనుగోజు సుభాష్ (బీపీఎం, కొమరారం), పి.శైలజ (బీపీఎం, మర్కోడు), బి.ఎల్లారావు (పాండురంగాపురం), గ్రూప్ యాక్సిడెంట్ జనరల్ పాలసీల విభాగంలో బి.మల్లేశ్వరరావు(డాక్‌సేవక్, గాంధీచౌక్), కె.సోమేశ్వరరావు(జక్కేపల్లి), అనుగోజు సుభాష్ (కొమరారం), పీఎల్ఐ విభాగంలో ఎన్.సందీప్ (డీఎస్‌యూ, ఖమ్మం), సీహెచ్‌వీబీ కుమార్ (చర్చి కాంపౌండ్, ఖమ్మం), ఎం.సత్యభాస్కర్‌రెడ్డి (ఎస్‌పీఎం, అశ్వారావుపేట)కు ప్రశంసాపత్రాలు దక్కాయి. అలాగే, పీఎల్ఐ జీడీఎస్ విభాగంలో కె.జగన్నాథం (డాక్‌సేవక్, అశ్వారావుపేట), ఎండీ రియాజ్ (డాక్ సేవక్, కారేపల్లి), భూక్యా శివమణి (బీపీఎం, తక్కెళ్లపాడు), పీఎల్ఐ డైరెక్ట్ ఏజెంట్ విభాగంలో జాడి పెంటయ్య (ఇల్లెందు), గుదిమళ్ల శ్రీనివాస్ (ఖమ్మం), జూగుంట్ల రమాదేవి (ఖమ్మం), ఆర్‌పీఎల్ఐ జీడీఎస్ విభాగంలో ఎండీ రియాజ్ (డాక్‌సేవక్, కారేపల్లి), వి.మహేశ్ (బీపీఎం, మందాలపాడు), ఎం.వెంకటేశ్వరరావు (డాక్ సేవక్, చర్ల), ఆర్‌పీఎల్ఐ డైరెక్ట్ ఏజెంట్ల విభాగంలో సీహెచ్ రమాదేవి (చెరువుమాధారం), ఆర్.మమత (ఖమ్మం), జి.సంపత్ (గార్ల), ఆధార్ ట్రాన్సాక్షన్ విభాగంలో ఎం.మనీశ్ (కలెక్టరేట్ ఖమ్మం), కె.లలితాదేవి (గాంధీచౌక్, ఖమ్మం), కె.సందీప్ (హెడ్డాఫీస్, కొత్తగూడెం) ప్రశంసపాత్రాలు అందుకున్నారు.



ఖమ్మం పోస్టుమాస్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డికి ప్రశంసా పత్రం అందజేస్తున్న సూపరింటెండెంట్ రవికుమార్

కార్పొరేట్లకు ప్రయోజనం కలిగించేలా మోదీ పాలన

- పంటలకు మద్దతు ధర హామీని నెరవేర్చాలి
- ఎస్‌కేఎం ఆధ్వర్యాన భారీ ర్యాలీ



ర్యాలీగా సాగుతున్న ట్రాక్టర్లు



అభివాదం చేస్తున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: పదేళ్ల పరిపాలనలో నరేంద్రమోదీ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడమే కాక కార్మికులు సాధించుకున్న హక్కులను కాలరాస్తూ కార్పొరేట్లకు దేశ సంపదను కట్టబెడుతున్నారని రైతు, కార్మిక సంఘాల నేతలు విమర్శించారు. కేంద్రం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యాన ఖమ్మంలో ట్రాక్టర్, వాహనాల ర్యాలీ నిర్వహించారు. నయాబజార్ కళాశాల మైదానం నుంచి జూబ్లీక్లబ్, మయూరిసెంటర్, వైరా రోడ్డు, ఇల్లెందు క్రాస్‌రోడ్, రోటరీనగర్ మీదుగా శ్రీశ్రీ విగ్రహం వద్దకు ఈ ర్యాలీ చేరుకుంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పంటలకు మద్దతు ధర, రుణవిమోచన, కార్మికవర్గ హక్కుల పరిరక్షణపై ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే మోదీకి తగిన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు రైతులు, కార్మికులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. రైతులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన మూడు నల్లచట్టాలను తాత్కాలికంగా వాయిదా వేసినా.. రైతాంగానికి ఆ ముప్పు ఇంకా పొంచి ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు బాగం హేమంతరావు, పొన్నం వెంకటేశ్వరరావు, వి.కోటేశ్వరరావు, బందెల వెంకయ్య, దొండపాటి రమేశ్, ఆవుల వెంకటేశ్వర్లు, శింగు నరసింహారావు, కల్యాణం వెంకటేశ్వరరావు, జి.రామయ్య, వై.విక్రమ్, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ బ్లాస్టింగ్ కేసులో వ్యాపారి అరెస్ట్

తిరుమలాయపాలెం: ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులోని వ్యవసాయ క్షేత్రంలో అక్రమంగా కంప్రెషర్లతో బాంబులు పేల్చిన ఘటనలో మహబూబాబాద్ జిల్లాకు చెందిన మద్యం వ్యాపారి నున్నా రమణను శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 2021 జూన్ 10న పిండిప్రోలు సమీపంలో రమణకు చెందిన వ్యవసాయక్షేత్రంలో బండరాళ్లను తొలగించేందుకు జిలెటిన్ స్టిక్స్‌తో పేలుళ్లు జరిపారు. ఈ ఘటనలో ఆయనతో పాటు మరికొందరిపై కేసు నమోదైంది. అప్పటి నుంచి కేసు పెండింగ్‌లో ఉండగా శుక్రవారం తిరుమలాయపాలెం ఎస్ఐ వరాల శ్రీనివాస్ డోర్నకల్ మండలం ఉయ్యాలవాడలో రమణను అదుపులోకి తీసుకుని ఖమ్మం కోర్టు ద్వారా రిమాండ్‌కు తరలించారు.